వైభవంగా విజయదశమి సంబురాలు



దసరా పండుగలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



దసరా సందర్భంగా ఎమ్మెల్యేను కలిసిన నాగారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ నేతలు



కీసరగుట్టలో శమీ పూజలో ఆలయ చైర్మన్ నాగలింగం దంపతులు



నాగారంలో మున్సిపాలిటీలో.. మున్సిపల్‌చైర్మన్ కొౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో శనివారం దసరా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. నాగారం మున్సిపాలిటీలో దసర సందర్భంగా నిర్వహించిన శమీ పూజలో మున్సిపల్ చైర్మన్ కొౌకుట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు. కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం, చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయాల్లో దసరా సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలతో పాటు, శమీపూజల్లో ఆలయ చైర్మన్లు తటాకం నాగలింగం దంపతులు, మల్లారపు లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొన్నారు. కీసర, రాంపల్లి, అంకిరెడ్డిపల్లి, గోధుమకుంట తదితర ప్రాంతాల్లో కూడా ప్రజలు దసరా పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

మేడ్చల్‌రూరల్‌లో...

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంలపల్లి మున్సిపాలిటీతోపాటు మండలంలోని గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా సాగాయి. ప్రజలు ఉదయాన్నే ఇంటిని ఆకుపచ్చ తోరణాలతో అలంకరించి అమ్మవారికి, వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నూతన వస్త్రాలు ధరించి జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించి రావణ దహనం చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందంగా గడిపారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు బతుకమ్మ, దాండియా ఆటలు ఆడుతూ వేడుకను జరుపుకున్నారు.

ముగిసిన దేవీ నవరాత్రులు...

మేడ్చల్: తొమ్మిది రోజులపాటు వైభవంగా నిర్వహించిన దేవీ నవరాత్రులు ఆదివారం నిమజ్జనంతో ముగిశాయి. మేడ్చల్ పట్టణంలోని గడిమైసమ్మ ఆలయంలో, మున్సిపాలిటీ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో, వివిధ కాలనీల్లో, ఏర్పాటు మండపాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దసరా రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం నిమజ్జన కార్యక్రమాలను, ఊరేగింపులు నిర్వహించి చెరువులలో నిమజ్జనం చేశారు. భవానీ దీక్షలు తీసుకున్న వారు వివిధ ప్రాంతాల్లోని ప్రధాన అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి ఇరుముడులను సమర్పించి దీక్షలను విరమించారు.



మేడ్చల్‌లో అమ్మవారి నిమజ్జన ఊరేగింపు

ఘనంగా ఆయుధ పూజ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో విజయ దశమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానికి చిహ్నమైన కాషాయం జెండాను ఎగురవేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి ఆయుధ పూజ చేశారు. స్థానిక గురుకుల్ క్రీడా మైదానంలో జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో రావణ దహనం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మాజీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, యాదగిరి యాదవ్, మాజీ ఎంపీటీసీ శోభారాణి, దామోదర్‌రెడ్డి, జంగయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆయుధ పూజ చేస్తున్న చైర్ పర్సన్ పావని జంగయ్యయాదవ్



గుండ్లపోచంపల్లిలో రావణ దహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి



పూడూర్‌లో దసరా వేడుకల్లో దాండియా ఆడుతున్న మహిళలు

అంబరాన్ని అంటిన దసరా సంబరాలు...

మేడ్చల్ : దసరా పండుగను మేడ్చల్ మున్సిపాలిటీలో, మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల శివార్లలో షమీ చెట్టుకు పూజలు చేసి, అనంతరం జమ్మిఆకును ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అధికారపార్టీ నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసానికి వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ పట్టణం, డబీల్‌పూర్, అత్వెల్లి తదితర ప్రాంతాల్లో రావణ దహన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. మేడ్చల్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై పండగ సంబరాల్లో పాల్గొన్నారు. ఆదివారం నాయకులు, ప్రముఖులు ఎమ్మెల్యే, తమ పార్టీల నేతల ఇళ్ళకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



మేడ్చల్‌లో రావణ దహనం



మేడ్చల్‌లో రావణ దహనంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి





అన్నోజిగూడలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి.



అంకుశాపూర్‌లో విజయదశమి వేడుకలు



ఘట్‌కేసర్‌లో రావణ దహనం

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని గ్రామాల్లో నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. పూడూర్ గ్రామంలోని పోచమ్మ ఆలయంలో ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారికి నవరాత్రులు పూజలు నిర్వహించి ఆదివారం ఘనంగా ఊరేగింపు చేపట్టారు. అమ్మవారి లడ్డూకు వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన రవియాదవ్ రూ.42 వేలకు అమ్మవారి లడ్డూను దక్కించుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, మునీరాబాద్ మండపాల్లో నెలకొల్పిన అమ్మవారిని ప్రత్యేక పూజల అనంతరం ఘనంగా ఊరేగింపు నిర్వహించి గంగ ఒడికి చేర్చారు. ఊరేగింపులో నాయకులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



పూడూర్‌లో అమ్మవారి ఊరేగింపులో నాయకులు

ఆలయ పున: నిర్మాణానికి భూమి పూజ



పునఃనిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తుడుం యాదగిరి, నేతలు తదితరులు

కీసర: భక్తుల కొంగు బంగారంగా పేరొందిన కీసర శ్రీ బంగారు మైసమ్మ దేవాలయ పున: నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయ చైర్మన్ తుడుం యాదగిరి అన్నారు. శనివారం కీసరలో గల శ్రీ బంగారు మైసమ్మ ఆలయ పున: నిర్మాణ భూమి పూజ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాధురివెంకటేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు రమేష్‌గుప్తా, జంగయ్య యాదవ్, తటాకం నారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు రవికాంత్, నేతలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ తన సొంత ఖర్చులతో దసరా పండుగ సందర్భంగా ఘనాపూర్‌లో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విలీన గ్రామాలైన ఎదులాబాద్, ఘనాపూర్, అవుషాపూర్, అంకుషాపూర్, మాదారం, మర్పల్లిగూడలో పనిచేస్తున్న 110 మంది సిబ్బందికి దుస్తులు అందజేశామన్నారు. సిబ్బంది బాగుంటేనే అందరం బాగుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు బద్దం గోపాల్‌రెడ్డి, వేముల మమత గౌడ్, మాజీ ఉపసర్పంచ్ వేముల పరమేష్ గౌడ్, యూత్ అధ్యక్షుడు అమర్, మాజీ ఎంపీటీసీ కందుల కుమార్, సీనియర్ నాయకులు మాధవరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ టీమ్‌లో సత్తా చాటిన మేడ్చల్ యువతి



మేడ్చల్: జాతీయ త్రోబాల్ మహిళల జట్టు విజయంలో మేడ్చల్‌కు చెందిన యువతి ప్రసన్న కుమారి కీలక పాత్ర పోషించింది. కండ్లకోయ సీఎంఆర్ కళాశాలలో ప్రసన్నకుమారి బీటెక్ 4వ సంవత్సరం చదవుతోంది. తల్లి అంగన్‌వాడీ టీచర్, తండ్రి వెల్డర్‌గా పని చేస్తున్నారు. ఆటలపై ఉన్న ఆసక్తితో ప్రసన్న కుమారి జాతీయ త్రోబాల్ జట్టుకు ఎంపికైంది. ఇటీవల బ్యాంకాక్, థాయిలాండ్‌లలో జరిగిన మ్యాచ్‌లలో ఆమె పాల్గొని విజయాలు సాధించింది. దీంతో ఆదివారం స్వస్థలంకు చేరుకున్న ఆమెను స్థానికులు, బంధువులు అభినందించి సన్మానాలు నిర్వహించారు.

అంబేడ్కర్‌కు ఘనంగా నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేశవపట్నం ఆంజనేయులు

ఘట్‌కేసర్: ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఈడబ్ల్యుఎస్ కాలనీ అధ్యక్షుడు కేశవపట్నం ఆంజనేయులు పాల్గొని రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ అభిమాన సంఘ ప్రతినిధులు మేకల దాస్, శశిధరన్, గోపాల్, శ్రీనివాస్, రాజేష్ కుమార్, సత్యం, శ్రీరామ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి

ఉప్పల్: చిలుకేశ్వర ఆంజనేయస్వామి దేవస్థానం హరిహర క్షేత్రం చిలుకానగర్‌లో విజయదశమి పండుగ సందర్భంగా మూలవిరాట్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుబాష్‌రెడ్డి. చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో లారీ క్లీనర్ మృతి

శామీర్‌పేట్: విద్యుత్ షాక్‌తో లారీ క్లీనర్ మృతి చెందిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్‌కు చెందిన అబ్దుల్ అదిల్ ఖాన్ (28), లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శామీర్‌పేట మండలం, మజీద్‌పూర్‌లోని ఓ పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే తను పనిచేస్తున్న లారీ టైర్ పంచర్ అయ్యింది. దీంతో లారీ టైరు మార్చేందుకు అవసరమయ్యే సామాగ్రి తీసుకునేందుకు లారీ పైకి వెళ్ళగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న శామీర్‌పేట పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవంలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 24వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దశలవారీగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.



ఘనంగా శ్రీవారి కల్యాణమహోత్సవం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కల్యాణం ఘనంగా జరిగింది. కల్యాణమహోత్సవాన్ని ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసీ రమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు నిర్వహించారు. ప్రతి నెలా రెండో ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నామని ఈవో రవీందర్‌రెడ్డి వివరించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

మేడిపల్లి: పీర్జాదిగూడలోని 3వ డివిజన్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాయకులు ననబోలు రాజశేఖర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, రాముయాదవ్ పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

దసరా సంబరాల్లో నేతల ఆధిపత్య పోరు!



బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో దసరా సందర్భంగా నిర్వహించే రావణ దహన కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరుతో పండగ సంబరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పట్టణంలో దసరా నేపథ్యంలో పెద్ద చెరువు వద్ద వేదిక ఏర్పాటు చేసి రావణాసురుడిని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహ్మారెడ్డి అన్ని పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి రావణ దహన కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా చేసేవారు. బీఆర్ఎస్ మెజారిటీ కౌన్సిలర్లు, నాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ బలం పెరిగింది. ఉత్సవాలకు ఎమ్మెల్యే మల్లారెడ్డి తన అనుచరులతో హాజరయ్యారు. బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డికి స్వాగతం పలుకుతూ పట్టణ వ్యాప్తంగా గులాబీ మయం చేసి భారీ ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. దీంతో కొంత మంది కాంగ్రెస్ నాయకులు తమ అధికార బలంతో బీఆర్ఎస్ కటౌట్లను అధికారుల చేత తొలగింప చేశారు. బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ సిబ్బంది, అధికారులు, పోలీసులతో వాగ్వివాదంకు దిగి తమ ఫ్లెక్సీలను ఎందుకు తొలగిస్తున్నారని నిలదీశారు. దీంతో పండగ సంబరాల్లో సల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను సముదాయించి ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో కొంతమంది పట్టణంకు చెందిన వారు రావణ కటౌట్‌కు నిప్పటించగా, రావన దహనం చకచకా జరిగిపోయింది. నాయకుల అధిపత్య పోరుతో అట్టహాసంగా జరగాల్సిన కార్యక్రమం ఉద్రిక్తతల మధ్య సాగింది.